క్లుప్తంగా

బేస్‌బాల్ జట్టు క్రీడాకారులకు సన్మానం



డిచ్‌పల్లి: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా హైదరబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ రాష్ట్రస్థాయి మహిళల బేస్‌బాల్ పోటీల్లో విజయం సాధించిన జిల్లా బేస్‌బాల్ జట్టు క్రీడాకారులు సోమవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రీడాకారిణులను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, డీఐవీవో ముత్తెన్న, జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ మధుసూదన్ రెడ్డి, సొప్పరి వినోద్ కుమార్, టి.నళిని, నీరజ రెడ్డి, స్వప్న, సుజాత తదితరులు పాల్గొన్నారు.

తాహెర్‌కు సన్మానం



నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్‌ను రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ సభ్యులు సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో సన్మానించారు. ఈనెల 29న నిర్వహించే కృతజ్ఞత సభకు ఆహ్వానించారు. తెలుగు, హిందీ, ఉర్దూ భాషోపాధ్యాయుల కలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జమీలుల్లా, రమణాచారి, శివ నాగమణి, సతీశ్ వ్యాస్, శాలి, గంట్యాల ప్రసాద్, ప్రవీణ్ కుమార్, నగేశ్, చింతల శ్రీనివాస్, కాసర్ల నరేశ్, పెంట శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే కాంగ్రెస్‌లో చేరికలు



నిజామాబాద్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు పలువురు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మల్లారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు గాజుల శంకర్, బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు గాజుల అబ్బారెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జవాజీ రమేశ్, పైసా ఎల్లయ్య, గాస్కంటి లక్ష్మణ్, మసూద్, శ్రావణ్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఎన్నికల్లో సత్తా చాటాలి



సుభాష్‌నగర్: మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సత్తా చాటి బల్దియాపై కాషాయ జెండా ఎగురవేస్తామని బీజేపీ జిల్లా కార్యాలయ సహ కార్యదర్శి దొంతుల రవి పేర్కొన్నారు. బీజేపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా నగరంలోని 21వ డివిజన్‌లో బూత్ అధ్యక్షుడు, బూత్ కమిటీలను సోమవారం ఎన్నుకున్నారు. బూత్ అధ్యక్షుడిగా అనిల్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా సుధీర్, 34వ డివిజన్ అధ్యక్షుడిగా విజయ్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా జంగిటి శ్రీధర్ ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన వారిని సన్మానించారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ సంజీవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీసీపీకి వినతి



నిజామాబాద్‌నాగారం: ముబారక్‌నగర్‌లో కేటాయించిన ఒలింపిక్ స్థలాన్ని కొందరు కబ్జా చేశారని దానిని రక్షించాలని సంఘ సభ్యులు సోమవారం డీసీపీ బసవరెడ్డిని కలిసి విన్నవించారు. 800గజాల స్థలంలో రూ. 20లక్షలు పెట్టి పిల్లర్లు నిర్మిస్తే కూల్చివేశారని పేర్కొన్నారు. భూ కబ్జాదారుల నుంచి స్థలాన్ని కాపాడి న్యాయం చేయాలని విన్నవించారు. జిల్లా కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, ఉపాధ్యక్షుడు గాదారి సంజీవరెడ్డి ఉన్నారు.

సిండికేట్ కల్లు వ్యాపారంపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్ నగరంలో 1,2 కల్లు గీత కార్మిక సొసైటీ లు సిండికేట్ అయి కల్లు వ్యాపారం చేస్తున్నారని దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు ప్రజావాణిలో కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు వరదయ్య, బి భాస్కర్, గంగారెడ్డి, దుడ్డు గంగాధర్, శివ రాజు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి కట్టడాలకు మోక్షం

- అభివృద్ధి పథంలో నిజామాబాద్ రూరల్
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



కేశాపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి(ఫైల్)

నిజామాబాద్ రూరల్: రూరల్ మండలం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. మండలంలోని పలు గ్రామాల్లో ఏళ్ల తరబడిగా అసంపూర్తిగా ఉన్న కట్టడాలకు కాంగ్రెస్ హయాంలో మోక్షం లభిస్తోంది. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పనులకు శంకుస్థానలు చేస్తున్నారు. దీంతో స్థానిక ప్రజలు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల రూరల్ మండలంలోని ఖానాపూర్ డివిజన్, కేశాపూర్, జాలాల్‌పూర్, తిర్మన్‌పల్లి గ్రామాల్లో సుమారు రూ. 15 కోట్లతో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. పాఠశాల ప్రహరీ, డ్రయినేజీలు, సీసీ రోడ్డు, బీటీ రోడ్లు, లిఫ్టి ఇరిగేషన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. దీంతో గ్రామాల అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్న గ్రామస్తుల కల నెరవెరుతోంది. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని, స్థానిక ప్రజాప్రతినిధులు ధనార్జనే ధ్యేయంగా పని చేశారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. రూరల్ మండలానికి గత ప్రభుత్వ హయాంలో ఆశించదగ్గ నిధులు రాలేవని మండల ప్రజలు పేర్కొంటున్నారు.

సమస్యలు పరిష్కారం..

కాంగెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రూరల్ మండల ప్రజలు తమ గ్రామాల్లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తోందని దీమా వ్యక్తం చేస్తున్నారు. రూరల్ మండలంలోని నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



ఖానాపూర్ డివిజన్‌లో ఎన్నో ఏళ్లుగా రోడ్డు కంకర తేలింది. దీంతో వాహనదారులు,స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గత ప్రభుత్వానికి సమస్యను తీసుకెళ్లినా స్పందించలేదు. ప్రస్తుత రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి చొరవతో డివిజన్‌లో నూతన రోడ్లు, డ్రయినేజీలు ఏర్పడ్డాయి. సమస్యలను పరిష్కరించిన ఎమ్మెల్యేకు అండగా ఉంటాం.

– కొర్వ రాజేంద్ర ప్రసాద్, ఖానాపూర్

కాంగ్రెస్‌కు అన్ని మతాలు సమానమే

రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్: కాంగ్రెస్‌కు అన్ని మతాలు, కులాలు సమానమేనని, ఆ పార్టీ ఆలోచనా విధానాన్ని ప్రతిఒక్కరూ అర్థం చేసుకోవాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. సోమవారం నగరశివారులోని బోర్గాం(పి)లో ఉన్న మోటాటిరెడ్డి కల్యాణ మండపంలో రూరల్ నియోజకవర్గ సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భూపతిరెడ్డి కేక్ కట్ చేసి ఫాస్టర్లకు తినిపించారు. అంతకుముందు ఫాస్టర్లు ప్రార్థనలు చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..అన్ని మతాలను, ప్రజలను గౌరవించాలని దేవుడు చెబుతున్నారని, దేవుడి ముందు అందరూ సమానులేనని తెలిపారు. ప్రజల మధ్య శత్రుత్వం పెంచేలా కొన్ని పార్టీలు మతాల పేరుతో రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. పేదలను ఆదుకోవడం, వారికి సంక్షేమ పథకాలు వర్తింపజేయడం కాంగ్రెస్ ఆలోచన విధానమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎవరికీ వ్యతిరేకం కాదని, రాజ్యాంగాన్ని సవరించే ప్రయత్నం బీజేపీ చేస్తోందన్నారు. క్రైస్తవులకు కమ్యూనిటీ హాల్స్, అర్హులైన వారికి ఇందిరేమ్మ ఇండ్లు తప్పకుండా ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, నాయకులు మునిపల్లి సాయిరెడ్డి, మండలాల అధ్యక్షులు, సొసైటీ చైర్మన్లు, మత పెద్దలు యేసురత్నం, రాజ్‌కుమార్, రాములు, డానియేల్, యోహానా, యేసుదాసు, జోసెస్, గొర్కంటి లింగం, నీరడి లక్ష్మణ్, మెట్టు సాంసన్, బాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



నిజామాబాద్ రూరల్: ఇందూరు జిల్లా బాల సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కవితా, రచనల పోటీల్లో విద్యార్థులు జిల్లాస్థాయిలో బహుమతులు గెలుచుకోవడం అభినందనీయమని గుండారం జెడ్పీ ఇన్‌చార్జి హెచ్‌ఎం గిరిధర్ అన్నారు. సోమవారం ఇందూరు జిల్లా బాలసాహిత్య వేదిక అధ్యక్షుడు కాసర్ల నరేశ్‌రావు పాఠశాలను సందర్శించి విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులు పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్న తెలుగు ఉపాధ్యాయులు దస్తగిరి, నరేంద్రమూర్తిలను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆరోగ్యరాజ్, నవీనకుమారి, శుభదేశ్ పాండె, ప్రణీత, పుష్పలత, దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ధ్యేయం



రైతులను సన్మానిస్తున్న చైర్మన్ ముప్ప గంగారెడ్డి

సుభాష్‌నగర్: రాష్ట్రంలో రైతులను రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి అన్నారు. సోమవారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా మార్కెట్ కమిటీలో రైతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే రైతాంగానికి రూ.56వేల కోట్లను వెచ్చిందని, బోనస్, రుణమాఫీతో రైతులంతా సంతోషంగా ఉన్నారని అన్నారు. భవిష్యత్‌తో రైతుల సంక్షేమానికి మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు కృషి చేస్తోందన్నారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ అపర్ణ, డైరెక్టర్లు మల్లేశ్, రఘువీర్, మంగ్యా, బాగారెడ్డి, కాలూరు మాజీ సర్పంచ్ అగ్గు భోజన్న, మోపాల్ మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, నాయకులు, రైతులు ప్రవీణ్ రెడ్డి, సాయన్న, లక్ష్మారెడ్డి, సుభాష్, రఘు, పోశెట్టి, గంగారెడ్డి, నారాయణరెడ్డి, రాకేశ్ పాల్గొన్నారు.

వ్యాపారాభివృద్ధికి రుణాలు అందిస్తాం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మహిళా సంఘాల సభ్యులకు వ్యాపారాలు అభివృద్ధి చేసుకునేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు రుణాలు అందజేస్తామని బ్యాంకుల మేనేజర్లు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఇండియన్ బ్యాంకు చీఫ్ మేనేజర్ సుధాకర్, కరీంనగర్ జోనల్ ఆఫీస్ మేనేజర్ సంతోష్‌కుమార్, నిజామాబాద్ మెయిన్ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ రామానంద్, మేనేజర్ పవార్ ఏపీఎం మోహన్‌తో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మహిళా సంఘాలకు ఇండియన్ బ్యాంకు ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను 753.74లక్షలకు గాను ఇప్పటివరకు 697.39 లక్షలు ప్రగతి సాధించారని బ్యాంకు ప్రతినిధులు తెలిపారు. మార్చి 31లోపు మిగిలిన 56.35లక్షల లక్ష్యం పూర్తి చేస్తామన్నారు. అలాగే లక్‌పతి దీదీ కింద మహిళలను లక్షాధికారులను చేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉందన్నారు.

ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ



పీవీ విగ్రహానికి పూలమాలలేసి నివాళులు అర్పిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్: దేశంలో ఆర్థిక సంస్కరణల పితామహుడు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అని, వారి ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు నడుస్తోందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. సోమవారం మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు 20వ వర్ధంతి సందర్భంగా నగరశివారులోని బోర్గాం(పి) చౌరస్తాలో పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దేశం ఆర్థికంగా గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్న సమయంలో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి గట్టెక్కించారని గుర్తుచేశారు. ప్రధానిగా పీవీ సేవలు అమోఘమని కొనియాడారు. ఆయన వెంట నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నాయకులు అమృతాపూర్ గంగాధర్, సుభాష్, రఘు, శివ లింగం, రాజశేఖర్‌రెడ్డి, విఠల్, సాంసన్ తదితరులు ఉన్నారు.



బీఆర్‌ఎస్ కార్యాలయంలో..

బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు వర్ధంతి తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బోర్గాం(పి) చౌరస్తాలోని ఆయన విగ్రహానికి జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన వెంట నాయకులు కిరణ్ కుమార్ దేశ్‌పాండే, లక్ష్మీనారాయణ భరద్వాజ్, నాగేశ్వర్‌రావు, తెలంగాణ శంకర్, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ కార్యాలయంలో..

నిజామాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



జక్రాన్‌పల్లి: మండలంలోని మనోహరాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బాలయ్య కుమార్తె వివాహానికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరయ్యారు.నూతన వధూవరులను ఎమ్మెల్యే ఆశీర్వదించారు.అనంతరం ఎమ్మెల్యే భూపతిరెడ్డిని అయ్యప్ప స్వాములు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సాయారెడ్డి,శేఖర్‌గౌడ్,అర్గుల్ నర్సయ్య, అనంత్‌రెడ్డి, కాట్‌పల్లి నర్సారెడ్డి, మద్దుల రమేశ్, భాస్కర్‌రెడ్డి, ఉమ్మాజి నరేశ్, సొప్పరి వినోద్ పాల్గొన్నారు.

ధర్మారం(బి)లో క్రిస్మస్ వేడుకలు



డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో ఉన్న ఎస్టీ జోసఫ్ స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎఫ్ఆర్ మారియా రాజు, రేవఎస్ఆర్ రోస్లిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో గణిత దినోత్సవం



బోర్గాం(పి)లో విద్యార్థులకు నోట్‌బుక్కులు పంపిణీ చేసిన దృశ్యం

మోపాల్: మండలంలోని కంజర్, నగరశివారులోని బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సోమవారం గణిత దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. బోర్గాం(పి)లో విద్యార్థులు తాము తయారు చేసిన మోడల్స్, చార్ట్స్, ఫార్ములాలను ప్రదర్శించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకర్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, స్వప్న, కిషన్, శ్రీనివాస్, వెంకటేశ్వర్, కల్పన, దీప తదితరులు పాల్గొన్నారు.

కంజర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో..

కంజర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి హెచ్‌ఎం గోపాలచారి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గణిత ఉపాధ్యాయుడు రాఘవాపురం గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పిల్లలకు గణిత ప్రదర్శనలు, క్విజ్, ముగ్గుల పోటీలు, ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. శ్రీనివాస రామానుజన్ చిత్రపటంతోపాటు గణిత రంగోళి, ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, ఉమ, గౌరీ, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్పల్లిలో..

ధర్పల్లి: మండల కేంద్రంలోని లిటిల్ హార్ట్ పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు గణిత నమూనాలను తయారుచేసి ప్రదర్శన చేశారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా గణిత సంబంధిత అంశాలను పాఠశాల సిబ్బంది వర్క్ షాప్ నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు గణిత అక్షరమాల ఆకారంలో కూర్చొని ప్రదర్శన ఇచ్చారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్, హెచ్‌ఎం సాధన, ప్రశాంత్ గౌడ్ ఉన్నారు.

పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు?

ఖలీల్‌వాడి: నగరంలోని బస్టాండ్‌లో ఇద్దరు బైక్ దొంగలను ఒకటవ టౌన్ పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఇటీవల కాలంలో బైక్‌లు చాలా చోట్ల బైక్ దొంగతనాలు జరిగాయి. వీటిని నిందితులు చోరీలకు పాల్పడ్డారా అనే కోణంలో విచారణ చేపడుతున్నట్లు తెలిసింది.

వృద్ధురాలి మృతి

నిజామాబాద్ నాగారం: నగరంలోని ఖలీల్‌వాడిలోని ఓ ఆస్పత్రిలో వృద్ధురాలు మృతి చెందింది. వివరాలు ఇలా.. మాణిక్‌బండార్‌కు చెందిన అమీనా బేగం(70) కొన్ని రోజుల క్రితం చికిత్స నిమిత్తం విక్రమ్ హాస్పిటల్‌లో చేరింది. సోమవారం సాయంత్రం శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో ఆమెను మరో ఆస్పత్రికి అంబులెన్సులో తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ఆమెను పరిశీలించి అప్పటికే చనిపోయిందని నిర్ధారించారు. కార్డియాక్ అరెస్టుతోనే చనిపోయిందని వైద్యులు చెబుతుండగా.. మృతురాలి కుటుంబీకులు మాత్రం ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే మృతిచెందినట్లు ఆరోపించారు. మృతదేహాన్ని విక్రమ్ హాస్పిటల్‌కు తీసుకెళ్లేందుకు ఎక్కించగా పోలీసులు అడ్డుకున్నారు. ఆస్పత్రి వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

- ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వినియోగంలోకి తేవాలి
- కౌన్సిల్ సమావేశానికి ఏర్పాట్లు చేయాలి
- మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే ధన్‌పాల్ సమీక్ష



కమిషనర్‌తో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. సోమవారం బల్దియా కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బోధన్ బస్టాండ్ సమీపంలోని అహ్మద్‌బజార్‌లో నిర్మించి వృథాగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వినియోగంలోకి తేవాలన్నారు. అక్రమంగా నిర్మించిన కట్టడాలు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని సూచించారు. మున్సిపల్ కార్పొరేటర్ల పదవీకాలం ఈనెలతో ముగియనుండటంతో వెంటనే కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. సమావేశంలో కమిషనర్‌తో పాటు డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, అడిషనల్ కమిషనర్ ఎన్ శంకర్, మున్సిపల్ చీఫ్ ఇంజినీర్ మురళీమోహన్‌రెడ్డిలు ఉన్నారు.

బీజేపీకి దళితులను దూరం చేసే కుట్ర

- బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బీఆర్ శివప్రసాద్



మాట్లాడుతున్న బీఆర్ శివప్రసాద్

సుభాష్‌నగర్: దేశంలోని ప్రతిపక్ష పార్టీలన్నీ కేంద్ర మంత్రి అమిత్‌షా మాట్లాడిన మాటలను వక్రీకరిస్తూ బీజేపీకి దళిత సమాజాన్ని దూరం చేసే కుట్రలు చేస్తున్నాయని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఆర్ శివప్రసాద్ విమర్శించారు. సోమవారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంబేడ్కర్‌ను ఎన్నికల్లో ఓడించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, ఆయన అంత్యక్రియలు కూడా ఢిల్లీలో కాకుండా బొంబాయిలో చేసి అవమానించారని ఆరోపించారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని దుష్ప్రచారం చేశారని, కానీ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ఏనాడూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా పని చేయలేదన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని కాపాడుతోందని అన్నారు. ఇటీవల మహారాష్ట్ర ఎన్నికల్లో దళితులంతా బీజేపీకి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించారని, దీన్ని ఓర్వలేక కుట్రలు, కుతంత్రాలను కాంగ్రెస్ మొదలుపెట్టిందని ఆరోపించారు. అంబేద్కర్, భారత రాజ్యాంగానికి బీజేపీ వ్యతిరేకం కాదని, దళిత సమాజం మరోసారి ఆలోచించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు కుమార్, సందీప్, కెప్టెన్ రాజు, ముత్యాలు, సంజీవ్, బాలకృష్ణ, పవార్ పాల్గొన్నారు.

క్రీడాకారులపై నిర్లక్ష్యం తగదు

తెయూ(డిచ్‌పల్లి): తెయూలో క్రీడాకారులపై వర్సిటీ ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పీడీఎస్‌యూ నాయకులు విమర్శించారు. ఈ మేరకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం తెయూ పరిపాలనా భవనం వద్ద నిరసన, ధర్నా నిర్వహించారు. ఈనెల 27 నుంచి తమిళనాడులో జరగనున్న సౌత్ జోన్ యూనివర్సిటీస్ ఖో–ఖో(పురుషుల) టోర్నమెంట్‌కు తెయూ నుంచి ఖో–ఖో టీంను పంపించాలని డిమాండ్ చేశారు.టోర్నమెంట్‌కు రాష్ట్రంలోని ఇతర యూనివర్సిటీల నుంచి టీంలను పంపిస్తున్నారని, కానీ తెయూ నుంచి పంపడం లేదని విమర్శించారు. విద్యార్థులు చెల్లించే ఫీజుల్లో స్పోర్ట్స్ కు ప్రత్యేకంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, అయితే క్రీడల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇకనైనా క్రీడాకారులను టోర్నమెంట్‌కు పంపించాలని లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం రిజిస్ట్రార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ విశాల్‌కు సన్మానం



నిజామాబాద్‌నాగారం: నాగపూర్‌లో ఈ నెల 21, 22న ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ఆధ్వర్యంలో జాతీయ యువ మానసిక వైద్యుల సదస్సు నిర్వహించారు. ఇందులో జిల్లా కేంద్రానికి చెందిన ప్రొఫెసర్ విశాల్ హాజరై మానసిక వైద్య ప్రక్రియలో లైంగిక సమస్యలకు నూతన చికిత్సలపై మాట్లాడారు. ఈ చర్చ ఆసక్తికరంగా సాగి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందడంతో విశాల్‌కు నిర్వాహకులు అవార్డును అందజేశారు. భారత మానసిక వైద్య సమాజ అధ్యక్షుడు లక్ష్మీకాంత్ రాథి, నిర్వాహక కార్యదర్శి పతమ్ చందక్ పాల్గొన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	79,100	వెండి(కిలో)	92,500
22 క్యారెట్స్	72,982	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	20	గాజరుగడ్డ	40	60
బెండకాయ	50	80	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	50	80	దోసకాయ	30	50
దొండకాయ	40	60	ఆలుగడ్డ	30	50
బీర్నిసుకాయ	40	60	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	25	50
వంకాయ	30	50	బీట్‌రూట్	40	60
పాలకూర	30	50	కరివేపాకు	50	70
మెంతికూర	30	50	చామగడ్డ	35	60
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	80	చిక్కుడుకాయ	30	50
క్యాప్సికం	50	70			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	బచ్చల మల్లి (తెలుగు)-10.20 విడుదల పార్ట్-2(తెలుగు)-1.10 యుఐ(తెలుగు)-4.25,10.35 పుష్ప-2(తెలుగు)-7.00
స్క్రీన్-2	విడుదల పార్ట్-2(తెలుగు)-10.10,7.35 యుఐ(తెలుగు)-1.20 పుష్ప-2(తెలుగు)-4.00 ముఫాసా(తెలుగు)3డీ-10.30
స్క్రీన్-3	ముఫాసా(తెలుగు)3డీ-11.00, 5.00,7.35 పుష్ప-2(తెలుగు)-1.10,10.00

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-10.00,2.05,6.10 ముఫాసా(3డీ ఇంగ్లీష్)-10.15
స్క్రీన్-2	ముఫాసా(3డీ తెలుగు)-10.10, 1.00,7.55 పుష్ప-2 (హిందీ)-3.50,10.45
స్క్రీన్-3	విడుదల పార్ట్-2(తెలుగు)-10.00 బచ్చల మల్లి(తెలుగు)-1.35,10.30 యుఐ(తెలుగు)-4.35
స్క్రీన్ -4	బచ్చల మల్లి(తెలుగు)-10.25 యుఐ(తెలుగు)-1.25, 7.55 విడుదల పార్ట్-2(తెలుగు)- 4.20,10.50
లలితామహల్	యుఐ(తెలుగు)-11.15 2.15 విడుదల పార్ట్-2(తెలుగు)-6.15,9.15
దేవి	బచ్చల మల్లి తెలుగు)
నటరాజ్	విడుదల పార్ట్-2(తెలుగు)- 11.15,2.15 ముఫాసా(తెలుగు)- 6.15,9.15
విజయ్	పుష్ప-2 (తెలుగు)